కథా నిలయం
శ్రీకాకుళం

# ఒడ్డుకు చేరిన నావ

తోటలో మల్లెపందిరి దగ్గర తిన్నెమీద కూర్చుంది పద్మావతమ్మ-ప్రక్కనే ప్రొద్దు తిరుగుడు పూలు విరగబూసి వున్నాయి. ఇంకోవైపు అంటుమామిడిచెట్లు జంటగా వున్నాయి. వాటినీడ పద్మావతమ్మ ముఖంమీద పడుతోంది. పొద్దుతిరుగుడుపూలు పచ్చగా విరిసి సూర్యునివేపు వంపు తిరిగి ఉన్నాయి. ఆమె వాటికేసి చూస్తోంది- దీక్షగా! ఆ పూల బ్రతుకు ఆమెకు వింతగా తోచింది. ఆధారం లేకుండా నిలువలేని పూలు; సూర్యుడు ఉదయిస్తే కన్ను తెరుస్తాయి. ఆతను ఏ వేపు తిరుగుతే ఆ వేపే తిరుగుతాయి, అతను కనుచాటయితే అవీ బ్రతకలేక కన్ను మూస్తాయి. ఎంత విచిత్రం! ఆధారం లేకుండా బ్రతకలేని ఆడదాని బ్రతుక్కు ప్రతీక ఆ పూలు! తనూ అంతేకదా? ఏదో వెలుగు ఎదట కనిపించినన్నాళ్ళు వికాసము పొందింది. ఆ వెలుగు అస్తమించగానే దిక్కుతోచక చీకట్లో మనస్సు అల్లాడుతోంది! దీపం లేకుండా నీడ ఉండలేదు. ఇప్పుడు దీపం ఆరిపోయింది. అయినా ఇంకా నీడమాత్రం మిగిలి వుంది. ఇదేదో విచిత్రమైన పరిస్థితి!

దూరాన మేడ కనిపిస్తోంది. చెట్ల సందుల్లోంచి తెల్లనిగోడలు అందంగా ఉన్నాయి, అది తన ఇల్లు. ఎంతో ఓపికతో అందంగా కట్టించుకున్న ఇల్లు; ఉండేది తనూ. భర్త రామారావు ఇద్దరు మాత్రమే! అయినా విశాలంగా అందంగా కట్టించుకున్నారు. ఎక్కడెక్కడినుంచో, రకరకాల వస్తువులు తెచ్చి గదులన్నీ అలంకరించారు. అయినా ఇల్లంతా ఎప్పుడూ వాడలేదు. మేడమీద దక్షిణంవైపు మూడుగదులు మాత్రమే వాడుకునేవారు. క్రింద వంటఇల్లు భోజనాలగది. వసారా అన్నీ వంటామె చంద్రమ్మ అధీనంలో ఉంటాయి. మిగిలిన ఇల్లు దుమ్ము దులపడానికీ, ఎవరైనా వస్తే చూపించటానికీ మాత్రం ఎప్పుడైనా తలుపు తెరిచేవారు.

రామారావు సబ్బుల వ్యాపారం చేశాడు. అది అతనికి కలిసివచ్చింది. క్రమంగా ఆస్తి, అంతస్తూ పెరిగాయి, సుఖంగా కాలం గడపడానికి అలవాటుపడ్డాడు. తెల్లని బట్టలు, పువ్వులు, సుగంధ వస్తువులు, నాజూకు బ్రతుకు నేర్చుకున్నాడు. పద్మావతమ్మ అన్ని విధాల అతనికి నీడలా ఉండేది. అతని పనులన్నీ తానే చేసేది. ఏక్షణమైనా కాస్త దూరమైతే ఎదురుచూస్తూ ఉండేది. ఆమెకు మరొక బ్రతుకు, మరొక ఆలోచన లేవు.

అతను ఉన్నట్టుండి "రేపు మనం సిమ్లా వెళదాం!" అంటే వెంటనే బట్టలు సర్దుకునేది. "మనం పై నెల జపాను

వెడుతున్నాము" అంటే విని వూరుకునేది, "అమ్మో! అంతదూరమా!" అని మనసులో అనుకునేది. "ఈ ప్రయాణ మెందుకూ?" అని ఎప్పుడూ అడగలేదు. అతను వెళితే తానూ వెళ్ళాలి. అంతే! అతనికి ఉదయమే వేన్నీళ్ళు కాచి ఇవ్వాలి. అతను అన్ని సంగతులు తనతో చెపుతాడు. తాను ఓపికగా వినాలి. అంత మాత్రమే తెలుసు, వ్యాపార విష యాలన్నీ ఎంత చెప్పినా ఆమెకు అర్థంకావు. అతను అంద మైన వస్తువులను, సుందరమైన దృశ్యాలను వర్ణించి చెపితే అర్థమవుతుంది: ఇంకేమి అర్థంకావు, అయినా ఓపిగ్గా వింటూనే ఉంటుంది ఒక్కొక్కసారి మనసు నిలవదు. దృష్టి బయట విరగబూసిన సన్నజాజి తీగమీదకు పోతుంది. ఆ పువ్వులు గుప్పెడుకోసి తెచ్చుకోవాలనిపిస్తుంది. అయితే ఆమె పరధ్యానంగా ఉంటే అతనికి కోపం వస్తుంది. అందుకే కదలలేదు.

ఒకసారి ఈ మల్లెపందిరి దగ్గరే ఒంటరిగా కూర్చు న్నారు. పండువెన్నెల కాస్తోంది. ఆ క్షణం అతను ఎంతో సంతోషంగా ఉన్నాడు. పరిహాసంగా అన్నాడు. "ఇవ్వాళ మన వ్యాపారం పడిపోయినా ఫరవాలేదు. మనకున్న ఆస్తి మూడు తరాలకు సరిపోతుంది"అని. ఆమాటలకు ఆమె తెల్ల బోయింది. "మూడు తరాలా! ఇప్పుడు ఎవరున్నారు మనకు పిల్లలు లేరుకదా!" అనుకుంది. మాట్లాడలేదు. అతను

సంతోషంగా ఉన్నాడు. "ఇంత సాధించానుగదా! ఇంత సంపాదించానుకదా!" అని తృప్తికాబోలు! అతని మనసు నొప్పించకూడదు. అందుకే ఊరుకుంది.

మూడేళ్ళ క్రిందట అతనికి జబ్బుచేసింది. దగ్గు ఆయాసంతో కొన్నాళ్లు బాధ పడ్డాడు. మళ్ళా కోలుకు న్నాడు. నిరుడు మళ్ళా జబ్బుచేసింది. ఆరునెలలు జబ్బుగా ఉన్నాడు. తను ఇల్లు పూర్తిగా చంద్రమ్మకే వదిలేసింది. రాత్రింబగళ్లు అతని దగ్గరేవుంది. ఆరునెలలు ఆమెకు ఆకలి వేయలేదు, నిద్రారాలేదు. శరీరం నీరసించి తపనపడింది. అతనికి జబ్బు నయంకాలేదు. రోజు రోజుకూ బాధ ఎక్కు-వైంది. అతని ఆవేదన చూడలేక ఏమీ చెయ్యలేక ఆమె అల్లాడిపోయింది ఒక్క-క్షణం ప్రాణమైనా పోతే బాగుండు ననిపించింది. ఆ ఊహ కామె అదరిపడింది. ఏమూలో తనలో రాక్షసత్వం ఉన్నదా! - అనుకుంది. కుమిలిపోయింది. ఏదో మైకంలా వచ్చి ఒక్క-క్షణం ఒళ్ళు తూలింది. తేరు కుని అతనివేపు చూచింది. అతను ప్రశాంతంగా ఉన్నాడు. అతని ముఖంలో ఇప్పుడు ఏ ఆవేదనా లేదు, ఆమె అతను నిద్రపోతున్నాడనుకుంది. కదిలితే మెళకువ వస్తుందేమో! మళ్ళా బాధపడతాడేమో! అలాగే భయంగా ఒదిగి కూర్చుంది, ఒక్క-క్షణం; అతను అన్ని బాధలకు అతీతంగా వెళ్ళిపోయాడన్న సంగతి తెలియలేదు.— డాక్టరు వచ్చి చెప్పిందాకా!

ఆకాశంలో ఆడుతున్న గాలిపటం, నేలమీద లాగుతున్న దారం తెంపుకు వెళ్ళిపోయింది, ఏ మూలకో! ఈ మేడల సందున ఎక్కడని దాన్ని వెతకటం! పద్మావతమ్మ బ్రతుకు తెగిన దారంలా రెపరెపలాడింది. అతను ఉండగా ఆమెకు ఏచింతాలేదు, అతను ఎప్పుడూ ఆమె కొంగుపట్టుకు వదలలేదనికాదు. ఒక్కొక్కరోజు పొద్దున వెళితే మళ్ళా రాత్రికే కనిపించేవాడు అయినా అప్పుడు బాధలేదు, ఒంటరితనంలేదు, ఇప్పుడు ఇల్లంతా బోసిగావుంది. బ్రతుకు భయంకరంగా వుంది. చంద్రమ్మ పనిగట్టుకు పైకివచ్చి కూర్చునేది,—తనకుతోడు. కాని అది ఆమెకు నచ్చలేదు, మరొక మనిషివుంటె మరీ ఏదో ముళ్ళు గుచ్చుకున్నట్లు ఉండేది. ఒంటరిగా వసారాలో పూలచెట్లను చూస్తూ కూర్చునేది, ఆ క్షణం అతను ప్రక్కనే ఉన్నట్లు భ్రమకలిగేది. అది కాస్త ఊరట!

కొన్నాళ్ళకి ఇతర విషయాలు మనసులో ప్రవేశించాయి! నీడలు కమ్ముకున్నాయి, మేనేజరు మంచివాడేనా? ఏమో! మోసం చేస్తాడా? భయం పట్టుకుంది, మనశ్శాంతి పోయింది.

ఇంకొన్నాళ్ళకి ఎందరో వస్తామని వ్రాశారు. "అమ్మాయిని నిర్మలను మీవూరు పంపిస్తాను, చదువుకోటానికి, నీకు తోడుగా వుంటుంది." అని రాసింది అక్క, "నాకు మీవూరు బదిలీ అయింది. మీ ఇంట్లో ఉండాలని

ఉంది, సరళను పిల్లల్ను తీసుకువస్తాను." అని రాశాడు మేనల్లుడు.

పద్మావతమ్మకు ఏమీ తోచలేదు. అతను బంధువుల నెవరిని దగ్గరకు చేర్చలేదు. అతనికి ఒంటరి జీవితమే ఇష్టం. పద్మావతమ్మ తప్ప ఇంకెవరూ కావాలని అతనెప్పుడూ కోరుకోలేదు. మరి ఇప్పుడు తను ఏం చెయ్యాలి? ఆలోచన తెగలేదు. తనకు పిల్లలుంటే బాగుండేదేమో! అప్పుడు బ్రతకటానికి ఒక ఆధారమూ, కారణమూ ఉండేవి! కాని అతను ఎన్నడూ ఆ విషయమే పట్టించుకోలేదు. ఆలోచనలతో ఆమె తల వేడెక్కింది. ఏదో బాధ! భరించలేక వెళ్ళి రెండు నిద్రమాత్రలు మ్రింగింది. అవి ఎప్పుడో అతనికోసం తెచ్చినవి. మర్నాడు మధ్యాహ్నం వరకు నిద్రపోయింది. మెలుకువ రాలేదు.

తరువాత మనస్సు తేలిక పడింది. ఎప్పుడో అతను అన్నమాట జ్ఞాపకం వచ్చింది. "ఇంక సంపాదించకపోయినా ఫరవాలేదు. మన ఆస్థి మూడు తరాలకు సరిపోతుంది." ఈ తరంలో అనుభవించటానికే ఎవరూ లేరు. మూడు తరాల వరకు ఎందుకూ? దేనిమీదా తనకు ఆసక్తి లేదు. ఉన్న వాళ్లు అనుభవిస్తే ఏం? అనిపించింది. మనసులో బాధ పోయింది.

మేనేజరు ఎన్నాళ్ళగానో ఉన్నాడు. పిల్లలుగలవాడు. కష్టపడి పనిచేస్తున్నాడు. తన డబ్బు కొంత వాడుకొంటాడేమో నన్న భయమెందుకూ? పోనీలే – అనిపించింది.

బంధువులకు, స్నేహితులకు, తన్ను ఆశ్రయించుకున్నవాళ్లకు కాకపోతే ఈ డబ్బు తనకెందుకూ? భద్రంగా ఎన్నాళ్లు దాచుకుంటుంది! ఎంతకాలం బతుకుతుంది! ఎప్పుడూ ఇలానే ఉంటుందా? అనుకుంది విరక్తితో.

ఆ తరువాత అందరూ వచ్చారు. అక్కకూతురు నిర్మల వచ్చింది: మేనల్లుడు సంసారంతో వచ్చాడు. చంద్రమ్మ కూతురికి జబ్బుచేసింది. కూతుర్ని పిల్లలను తీసుకువచ్చింది.

ఇప్పుడు ఇల్లు సందడిగా ఉంది. పిల్లల అరుపులు, ఆటలు, పెద్దవాళ్ళ మాటలు కలకలలాడుతోంది. అందరూ అన్ని గదులు స్వేచ్ఛగా వాడుకుంటున్నారు. మేడమీద రెండుగదుల్లో మాత్రం పద్మావతమ్మ తలదాచుకుంది. అందరూ అన్నీ ఆమెను అడుగుతారు. అందరికీ ఆమెడబ్బు కావాలి. ఆమె సలహా కావాలి. అయినా వాళ్ల సమస్యలేవీ ఆవిడనెప్పుడూ బలంగా అంటటంలేదు. అందరిని చూస్తోంది. అందరితో మాట్లాడుతోంది. ఎవరికి ఏలోపమూ చెయ్యటం లేదు. అయినా ఏదీ మనసును అంటటంలేదు. తామరాకు మీద క్షణం నిలిచి జారిపోయిన నీటిబొట్టులా ప్రతిసంగతి ఒక్కక్షణం మనసునుతాకి మళ్లా జారిపోతోంది.

ఒడ్డుకు చేరిన నావలాఉంది, ఇప్పుడు ఆమె బ్రతుకు! కల్లోలం లేదు. ఏ క్షణాన అలలు ఉవ్వెత్తుగా లేస్తాయో, ఏ క్షణాన తుఫాను ముంచుకువస్తుందో అన్న భయంలేదు.

తీరాన ఉండి అలల తాకిడికి కదిలిపోతూన్న తెప్పలను వింతగా చూడటం వినోదంగావుంది.

సూర్యుడు అస్తమించాడు. ప్రొద్దుతిరుగుడుపూలు వాడిపోయినాయి, పద్మావతమ్మ లేచి ఇంటికి వెళ్ళింది. చంద్రమ్మ పిల్లలు తులసికోట దగ్గర కూర్చుని పాటలు పాడుకున్నారు. మేడమీద మేనల్లుడు భార్యనేదో పరిహాస మాడి ఉడికిస్తున్నాడు. ప్రక్కనే నిర్మల విరగబడి నవ్వు తోంది.

అప్రయత్నంగా పద్మావతమ్మ మెల్లగా నవ్వింది.